సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం ◊ 6 ◊ జనవరి ◊ 2023



రాజన్న సేవలో జిల్లా ప్రధాన జడ్జి

వేములవాడ: రాజన్నను గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో శ్రీనివాస్ స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



మంత్రి అభినందనలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ఓడీఎఫ్ ప్లస్..ప్లస్ పట్టణంగా నిలిచినందుకు మంత్రి కేటీఆర్ అభినందించారు. హైదరాబాద్‌లో గురువారం ప్రశంసాపత్రం అందించారు.

గరిష్టం/కనిష్టం 26.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్లక్రైం: నిబంధనలు అతిక్రమించిన వాహన యజమానులపై ట్రాఫిక్ పోలీసు కొరడా ఝుళిపించారు. 'అంతా మా ఇష్టం' శీర్షికతో 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. సిరిసిల్ల, వేములవాడలోని ప్రధాన రహదారుల వెంట ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని అన్ని స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధ్రువీకరణపత్రాల పరిశీలనతోపాటు నంబర్ ప్లేట్ సరిగ్గా లేని, అసలు నంబర్‌ప్లేట్స్ లేని వాహనాలను ఠాణాలకు తరలించారు. అన్ని ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలని, నిర్ణీత నమూనాలో నంబర్‌ప్లేట్ అమర్చుకోవాలని సిరిసిల్ల, వేములవాడ ట్రాఫిక్ ఎస్సైలు రాజు, దిలీప్ సూచనలు చేశారు.

యారన్ సబ్సిడీ చెల్లించాలి



ధర్నా చేస్తున్న పవర్‌లూమ్ కార్మికులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకమ్మ చీరల తయారీకి సంబంధించి 2020–2021 సంవత్సరాలకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీని 15 రోజుల్లోపు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు గేటు ఎదుట గురువారం టెక్స్‌టైల్ పార్కు పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం టెక్స్‌టైల్ పార్కు ఏడీకి వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ మాట్లాడుతూ పవర్‌లూమ్ కార్మికులకు కూలి పెంచాలని 2019లో సమ్మె చేయగా కూలి సర్దుబాటు పేరుతో 10 శాతం యారన్ సబ్సిడీని అందిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అధికారులు యజమానుల నుండి పూర్తిస్థాయిలో కార్మికుల ఉత్పత్తి వివరాలను తీసుకుని 15 రోజుల్లోపు సబ్సిడీ డబ్బులు అందించాలని కోరారు. జెల్ల సదానందం, రాచర్ల వేణు, దూడం సంపత్, కందికట్ల శ్రీనివాస్, వరప్రసాద్, నాగరాజు, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైజింగ్ కార్మికులకు అండగా నిలవాలి



లక్ష్మీనారాయణకు విన్నవిస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: సైజింగ్ కార్మికుల పోరాటానికి అండగా నిలవాలని కాటన్ వస్త్ర పరిశ్రమ పెద్దలను కార్మికులు కోరారు. జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కిశోర్ ఆధ్వర్యంలో కాటన్ యారన్, సైజింగ్, డైయింగ్, వస్త్రోత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులను గురువారం కలిసి వినతిపత్రాలు అందించారు. సమస్య పరిష్కరించాలని రాపెల్లి లక్ష్మీనారాయణ, పిస్క మధు, ఆడెపు రవీందర్‌లకు కోరారు. ఎలిగేటి రాము, ప్రకాశ్, రమేశ్, యాదగిరి, రాజు, మురళి పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

సిరిసిల్లఎడ్యుకేషన్: సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో, రుక్మిణీ గోవిందారావు ఎడ్యుకేషన్ ట్రస్ట్ సౌజన్యంతో సాంఘికశాస్త్ర సబ్జెక్టుపై 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షను ఈనెల 7 నిర్వహించనున్నట్లు జిల్లా సోషల్ ఫోరం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో వేర్వేరుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ మండలం నుంచి 8 మంది మొత్తం 13 మండలాల నుంచి 97 మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులలో మొదటి బహుమతి రూ.2వేలు, రెండో బహుమతి రూ.1500, మూడో బహుమతి రూ.వెయ్యి అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 98490 88196, 94907 21944 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పల్లె మెరిసింది

- స్వచ్ఛత కీర్తి.. జాతీయ స్ఫూర్తి
- జాతీయస్థాయిలో జిల్లాకు మొదటి స్థానం
- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో ఫోర్ స్టార్‌రేటింగ్
- ప్రకటించిన కేంద్ర తాగునీరు.. పారిశుధ్య మంత్రిత్వ శాఖ

సిరిసిల్ల: స్వచ్ఛతలో పల్లెలు పోటీస్తున్న క్రమశిక్షణ.. దేశవ్యాప్తంగా జిల్లాకు పేరు తీసుకొచ్చింది. పరిసరాల పరిశుభ్రత.. ఇంటింటి నుంచి చెత్త సేకరణ.. డంపింగ్‌యార్డు, కంపోస్టుషెడ్ల నిర్వహణ.. బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లెలు ఆదర్శంగా నిలిచాయి. ఈ చర్యలే జిల్లాను స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ విభాగంలో ఫోర్‌స్టార్ రేటింగ్‌తో మొదటి స్థానం దక్కేలా చేశాయి. 2022 డిసెంబర్‌లో ఇచ్చిన అన్ని పారామీటర్లలో జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఇంతకుముందే అక్టోబరు నెలలోనూ కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకును ప్రకటించడం.. ఒకే ఏడాదిలో రెండోసారి జిల్లాకు ఆ గుర్తింపు దక్కడం విశేషం.

జిల్లాలో ఏం చేశారంటే...

- రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పల్లెల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇంటింటికెళ్లి సేకరించారు.
- సేకరించిన తడి చెత్తతో ఎరువులను తయారు చేయడం, పొడిచెత్తను వేస్టేజ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా చెత్తగా విక్రయించారు.
- జిల్లాలోని 255 గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించి, ఇంటింటికీ మరుగుదొడ్లను నిర్మించి, వినియోగించడంలో ముందున్నారు.
- ఇంటింటికీ ఇంగుడుగుంత, పారిశుధ్య నిర్వహణ, దీనిపై వాల్‌పేయింటింగ్ చేయడం, ప్రతీ ఊరిలో చెత్త సేకరణకు ట్రాక్టర్లు ఉండడం, కంపోస్ట్‌షెడ్లు ఉండడం, రోడ్లుకు ఇరువైపులా మొక్కలను పెట్టి సంరక్షించడం, నర్సరీలు ఏర్పాటు చేయడం వంటి పనులతో జిల్లాలోని పల్లెలు మెరిశాయి.



పచ్చదనంతో బావుసాయిపేట వీధులు



డంపింగ్‌యార్డులో ప్లాస్టిక్ ఏరివేతను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

- పల్లెల్లో చేసిన ప్రతీ పనికి సంబంధించిన సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శులు యాప్‌లో నిర్దిష్ట గడువులోగా అప్‌లోడ్ చేసి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు.

మంత్రి కేటీఆర్ మార్గదర్శనం

మంత్రి కేటీఆర్ మార్గదర్శనంలో జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణాలు, ఇంకుడుగుంతలు, కంపోస్ట్ షెడ్లు, హరితహారం, తడి, పొడి చెత్త సేకరణ వంటి పనులు ఉద్యమంలా సాగాయి. మంత్రి కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శి కె.శ్రీనివాస్ జిల్లాలో మకాం వేసి పల్లెల్లో వీటి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు ఒక ఉద్యమంలా తీసుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ సత్య ప్రసాద్, డీపీవో రవీందర్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, డీఎల్‌పీవో మల్లికార్జున్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ బృందం సభ్యులు కె.సురేశ్, బి.ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పనులు చేయించారు.



మోహినికుంటలో ఇంకుడుగుంత పరిశీలన

అభినందనల వెల్లువ

జాతీయస్థాయిలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు మొదటి స్థానం రావడంతో రాష్ట్ర మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా కలెక్టర్‌ను, అధికారులను, ప్రజాప్రతినిధులను అభినందించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకుసాగాలని ఆకాంక్షించారు.

మరింత ఉత్సాహంతో పనిచేయాలి



ఇది రాజన్న సిరిసిల్ల జిల్లాకు లభించిన గౌరవం. మంత్రి కేటీఆర్ మార్గదర్శనంలో జిల్లాలో అందరూ సమన్వయంతో పనిచేయడంతో ఈ గుర్తింపు లభించింది. మరో మెట్టు ఎక్కే దిశగా ముందుకుసాగాలి. ఉపాధిహామీ పథకం జిల్లాలో బాగా వినియోగపడింది. జాతీయస్థాయిలో జిల్లాకు మొదటి స్థానం రావడం సంతోషంగా ఉంది. – అనురాగ్ జయంతి, కలెక్టర్

గుర్తింపు దక్కడం సంతోషం



రాజన్న సిరిసిల్ల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ముందుచూపుతో పల్లెప్రగతిని చేపట్టి ముందుకు నడిపించారు. పల్లెప్రగతి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ మరింత అభివృద్ధి దిశగా జిల్లా ముందుకుసాగేలా కృషి చేస్తాం. – న్యాలకొండ అరుణ, జెడ్పీ చైర్‌పర్సన్

ప్రతి ఊరిలో 20 ఎకరాల్లో ఆయిల్‌పామ్



సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని ప్రతి ఊరిలో 20 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల ఎంపీడీవోలు, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు అనువైన నేలను గుర్తించి, రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కసారి నాటితే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని, లాభసాటిగా ఉంటుందనే విషయాన్ని రైతులకు అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణాధికారులు ఉద్యానవనాధికారులు రైతులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

పీఎంఎఫ్‌ఎంఈపై సమీక్ష

ప్రధానమంత్రి ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్‌ఎంఈ)పై కలెక్టర్ సమీక్షించారు. ఈ పథకంలో లక్ష్యాలను సాధించాలని, ఎంత మంది బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేశారు, ఎంత మందికి ఆమోదం లభించింది, ఎన్నింటిని తిరస్కరించారని అడిగి తెలుసుకున్నారు. దళితబంధుపై సమీక్షించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023కు సన్నద్ధం కావాలని, ఓడీఎఫ్ ప్లస్‌లో ఇంకుడుగుంతలు పూర్తిచేయాలని, ఇంకా మిగిలిన మరుగుదొడ్లను నిర్మించాలని, క్రీడా ప్రాంగణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి రణధీర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, ఎంపీడీవోలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పునరావాసకాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్

అనంతగిరి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

ఇల్లంతకుంట(మానకొండూర్): అనంతగిరి భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. మండలంలోని అనంతగిరి పునరావాసకాలనీని గురువారం పరిశీలించి, నిర్వాసితులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ప్యాకేజీ రాని నిర్వాసితుల వివరాలు తమ దగ్గర ఉన్నాయని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. వారం రోజులపాటు అధికారులను గ్రామంలోకి పంపి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పునరావాసకాలనీలో అర్ధంతరంగా నిలిచిన డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, ఇతర నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ వచ్చేలా చూస్తామని, రేషన్‌కార్డుల సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. ఆర్డీవో శ్రీనివాస రావు, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ పల్లె నర్సింహారెడ్డి, ఎంపీటీసీ పర్శరాంగౌడ్, ఉపసర్పంచ్ బాలకిషన్ ఉన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం

- ఏఎస్పీ చంద్రయ్య

సిరిసిల్లటౌన్: దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య కొనియాడారు. సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సిరిసిల్ల ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎండీ సర్వర్ మియా, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ జాగీరుశైలు, దారుల్‌ఖైర్ వ్యవస్థాపకుడు ఎండీ ఖుద్దూస్, రఫీక్, సర్వర్, సలీం, అర్షత్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- వెంకటాపూర్‌లో డ్రెయినేజీల నిర్మాణం కోసం దీక్ష



వెంకటాపూర్‌లో దీక్ష చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ 2017లో గ్రామంలో డ్రెయినేజీలు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకపోకపోవడంతో జ్వరాలు వచ్చి ప్రాణాలు పోతున్నాయని మండలంలోని వెంకటాపూర్ గ్రామస్తులు గురువారం రిలే నిరాహారదీక్షకు దిగారు. గ్రామస్తులు మాట్లాడుతూ డ్రెయినేజీలను ఏళ్లు గడుస్తున్నా నిర్మించడం లేదన్నారు. ఈ సమస్యను పలుసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మంత్రి కేటీఆర్ హామీని నేరవేర్చే వరకు దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. త్వరగా పనులు చేపట్టకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. గ్రామస్తుల దీక్షకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి సంఘీభావం తెలిపారు. దీక్షలో ఉపసర్పంచ్ మేడిశెట్టి బాలయ్య, వార్డు సభ్యులు గడ్డం రవి, గుర్రాల రాజిరెడ్డి, పూర్ణచందర్, బీజేవైఎం జిల్లా కోశాధికారి మల్లారపు మహేశ్, నాయకులు రమేశ్, రవి, వెంకటేశ్, చంద్రశేఖర్, కార్తీక్, శ్రీకాంత్, దేవరాజ్, విజయ్, వంశీ పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 4,36,544

- మహిళలే అధికం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఓటర్లు 4,36,544 మంది ఉన్నట్లుగా కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. జిల్లాలో 2,12,469 మంది పురుష ఓటర్లు ఉండగా.. మహిళా ఓటర్లు 2,23,905 మంది ఉన్నట్లు నిర్ధారించింది. ఇతర ఓటర్లు (థర్డ్ జెండర్) 14 మంది, సర్వీసు ఓటర్లు 156 మంది ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 4,36,544గా నిర్ధారించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 2,27,989 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,16,066, పురుషులు 1,11,814, థర్డ్ జెండర్ ముగ్గురు, సర్వీసు ఓటర్లు 106 మంది ఉన్నారు.



ఓటేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు(ఫైల్)

వేములవాడ నియోజకవర్గంలో 2,08,555 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,07,839, పురుషులు 1,00,655, థర్డ్ జెండర్ 11, సర్వీసు ఓటర్లు 50 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం విశేషం.

పెరిగిన వరి విస్తీర్ణం!

- గతేడాది కన్నా గణనీయంగా పెరిగిన సాగు
- కేంద్రంతో ఘర్షణ వల్ల క్రితంసారి తగ్గుదల
- ధాన్యం కొంటామన్న ప్రకటనతో పంటలో వృద్ధి
- స్వల్పంగా తగ్గిన భూగర్భ జలాలు
- వరిసాగుతో పెరిగిన జలాల వినియోగం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వరిసాగులో రాష్ట్రంలో ముందు వరుసలో ఉంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మరోసారి తన సత్తా చాటింది. గతేడాది యాసంగిలో వరికి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన కలకలానికి దారి తీసింది. మరోవైపు పారాబాయిల్డ్ విషయంలో కేంద్ర రాష్ట్ర- ప్రభుత్వాల మధ్య సాగిన సంఘర్షణ కూడా రైతుల్లో ఉత్కంఠ పెంచింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యాన్ని కొనేది లేదని రాష్ట్ర సర్కారు తేల్చి చెప్పగా.. తక్కువమంది మాత్రమే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపారు. మెజారిటీ రైతులు వరిసాగుకే జైకొట్టారు. తమ భూమిలో వరి మినహా మరేవీ పండవని, ఏదైతే అదైందని చాలామంది రైతులు వరి వేశారు. కొందరు క్వింటాలుకు రూ.1200 తక్కువ ధరకు రైసు మిల్లులు, సీడ్ కంపెనీలతో ఒప్పందం చేసుకుని కొద్దిమొత్తంలో సాగు చేశారు.

పుంజుకున్న వరి

- గతేడాది వడ్ల కొనుగోలు విషయంలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం ముదరడంతో చివరికి రాష్ట్రమే కొంటామని ముందుకొచ్చింది.
- ఈసారి ఎలాంటి ఇబ్బందులు లేకపోవడం, వర్షాలు కూడా దండిగా కురవడంతో రైతులు తిరిగి వరి పంటకే మొగ్గుచూపారు. దీంతో కిందటేడాది కన్నా వరిసాగు గణనీయంగా పెరిగింది.
- ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలో గతేడాదితో పోల్చినపుడు ఈసారి వరిని 6,41,158 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేయగా జనవరి 4వ తేదీ వరకు 2,61,150 ఎకరాలు సాగు చేశారు.
- మిగిలిన పంటలు మొత్తం కలిపి 7,39,659 ఎకరాలు సాగు అవుతుందని అంచనా వేస్తుండగా.. ఇప్పటి వరకూ (జనవరి 4 వరకు) 2,90,800 ఎకరాలు సాగైంది.
- మొక్కజొన్న మాత్రం కరీంనగర్‌లో సీజన్ సాధారణంగా 24,145 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 3479 ఎకరాలు, పెద్దపల్లిలో 9758 ఎకరాలకుగాను 3479 ఎకరాలు, జగిత్యాల 17147 ఎకరాలకుగాను, 20774 ఎకరాలు, సిరిసిల్ల 1248 ఎకరాలకుగాను 276 ఎకరాల్లో సాగైంది.

గంగమ్మ దిగువకు..

- గతేడాది చాలామంది రైతులు వరిసాగుపై ఆసక్తి చూపకపోవడంతో మోటార్లు పనిచేయలేదు. ఫలితంగా మోటబావుల ద్వారా తక్కువ నీరు వినియోగించుకున్నారు.

యాసంగిలో సాగైన వరి..

జిల్లా	అంచనా	ఈనెల 4వరకు	గతేడాది	ప్రస్తుతం
కరీంనగర్	1,91,074	17,646	8,693	90,116
పెద్దపల్లి	1,50,495	21,978	4,429	37,060
జగిత్యాల	1,95,059	13,403	626	93,684
రాజన్నసిరిసిల్ల	1,04,530	18,720	1,674	40,290

అన్ని పంటల యాసంగి సీజన్..

జిల్లా	అంచనా	ఈనెల4 వరకు	గతేడాది	ప్రస్తుతం
కరీంనగర్	2,20,286	33,909	23,458	94,544
పెద్దపల్లి	1,62,004	26,169	7,391	38,952
జగిత్యాల	2,48,433	36,748	21,430	1,16,099
రాజన్నసిరిసిల్ల	1,08,936	21,458	4,109	41,205

- ఈసారి సర్కారు వరిసాగుపై స్పష్టత ఇవ్వడంతో బావుల్లో నీటి వినియోగం పెరిగి, భూగర్భ జలాలు దిగువకు జారిపోయాయి. కరీంనగర్‌లో 2021 డిసెంబరులో 4.83 మీటర్లు ఉండగా..ఈ ఏడాది అది 5.16 మీటర్ల దిగువకు చేరింది.
- జగిత్యాలలో భూగర్భ జలాలు గతేడాది భూఉపరితాలనికి 3.72 మీటర్ల దిగువన ఉండగా 2022 డిసెంబరునాటికి 3.86 మీటర్లకు చేరాయి.
- పెద్దపల్లి జిల్లా పాతాళ గంగ 2021 డిసెంబరులో 5.87 మీటర్ల దిగువన ఉండగా.. 2022 డిసెంబరునాటికి 4.56 మీటర్లకు వచ్చింది. అంటే పాతాళ గంగ ఈ జిల్లాలో 1.31 మీటర్లు పైకి ఎగిసింది.
- సిరిసిల్ల జిల్లాలో డిసెంబరు(2021)లో 4.52 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలు డిసెంబరు 2022 నాటికి 5.27 మీటర్లకు పడిపోయాయి.

జోరుగా వానలు..

మరోవైపు ఈసారి ఈశాన్య, నైరుతి రుతుపవనాల సమయంలో జోరుగా వానలు కురిశాయి. దీంతో ఈసారి కరీంనగర్ జిల్లాలో సాధారణ వర్షపాతం 833.3 మి.మీలు కాగా 1366.7 మి.మీలు అంటే 64 శాతం అధికంగా పడింది. పెద్దపల్లి జిల్లా సాధారణ వర్షపాతం 998.1 కాగా, 51శాతం అదనంగా 1505.1 మిమీల వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా సగటు వర్షపాతం 967.9 మి.మీలకు గాను 68 శాతం అదనంగా1623.1 మిమీ కురవడం గమనార్హం. ఇక రాజన్న సిరిసిల్ల విషయానికి వస్తే.. 851.5 మిమీ సాధారణ వర్షపాతానికి 50 శాతం అదనంగా 1280 మి.మీలు కురవడం విశేషం.

క్లుప్తంగా

సెస్ వైస్‌చైర్మన్‌కు మాతృవియోగం

కోనరావుపేట(వేములవాడ): సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి తల్లి రామలక్ష్మి(80) అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. రామలక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానికంగా చికిత్స పొందుతున్న రామలక్ష్మి బుధవారం మృతిచెందగా గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జగిత్యాల జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, చల్మెడ ఆస్పత్రి చైర్మన్ లక్ష్మీనర్సింహరావు, ఎంపీపీ చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్‌చైర్మన్లు భూంరెడ్డి, మహేశ్, సెస్ మాజీ వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్, టీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మల్యాల దేవయ్య పరామర్శించారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలో బైక్ ఢీకొని సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు. చంద్రంపేటకు చెందిన మ్యాన దశరథం సిరిసిల్ల వైపు వస్తుండగా.. అదే దారి గుండా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనదారుడు వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో దశరథం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తీసుకెళ్లారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గాజుల దేవదాసుకు ఇద్దరు కూతుళ్లు. రెండో కూతురు నవ్య(20) స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. నవ్యకు పరీక్షలు ఉండడంతో తండ్రి తన బైక్‌పై కళాశాలలో వదిలి వచ్చాడు. సాయంత్రానికి పరీక్ష పూర్తికాగా తీసుకెళ్లేందుకు కాలేజీకి దేవదాసు రాగా.. నవ్య కనిపించలేదు. కళాశాలలో చూడగా.. అప్పటికే వెళ్లిపోయినట్లుగా తెలిసింది. ఎంత వెదికినా ఆచూకీ లభించకపోవడంతో దేవదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దమ్మన్నపేటకు చెందిన దుంపల వంశీధర్‌రెడ్డి తన కూతురును తీసుకెళ్లాడని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నవ్య

ఒకరి ఆత్మహత్య

చందుర్తి(వేములవాడ): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక చందుర్తి మండలం మల్యాలకు చెందిన విక్రుర్తి రాజు(39) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో దూలానికి ఉరివేసుకున్నాడు. భార్య సవిత వచ్చి చూసి కేకలు వేసింది. చుట్టూ పక్కల వారు వచ్చి కిందికి దింపి చూడగా అప్పటికే రాజు మృతిచెందాడు. మూడేళ్ల క్రితం సైతం రాజు ఉరివేసుకోగా.. స్థానికులు కాపాడారని గ్రామస్తులు తెలిపారు. కాగా నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాల కోసం గ్రామస్తులు చందాలు వేసుకున్నారు. మృతునికి భార్య సవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.


రాజు (ఫైల్)

కార్డులిచ్చారు... పింఛన్ మరిచారు !

- జిల్లాలో 900 మందికి అందని పింఛన్లు
- నాలుగు నెలలుగా ఎదురుచూపులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ మాడిశెట్టి సత్తవ్వ. కోనరావుపేట మండలం బావుసాయిపేట. ఆమె భర్త అచ్చయ్య నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. వితంతు పింఛన్ కోసం నాలుగేళ్ల క్రితమే దరఖాస్తు చేసుకోగా ఆగస్టులో పింఛన్ మంజూరైందని కార్డు ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఆమెకు పింఛన్ డబ్బులు రావడం లేదు. నాలుగు నెలలుగా పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూస్తోంది.


పింఛన్ రావడంలేదని ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): అవసరార్థులుగా ఆసరాగా ఉంటుందని ప్రభుత్వం పింఛన్ డబ్బులు అందిస్తుంది. కానీ రాజన్నసిరిసిల్ల జిల్లాలో పింఛన్ మంజూరైందని కార్డు ఇచ్చినా డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదు. నాలుగు నెలలుగా జిల్లావ్యాప్తంగా 900 మందికి ఎదురుచూపులే దిక్కయ్యాయి.

వృద్ధులకు అండగా..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతీ నెల 23,963 మందికి వృద్ధాప్య, 9,833 వికలాంగులు, 21,733 వితంతు, 3,590 చేనేత, 2,078 గీతకార్మికులు, 1,786 ఒంటరి మహిళలు, 43,174 మందికి బీడీకార్మిక పింఛన్లు వస్తున్నాయి. వికలాంగులకు ప్రతీ నెల రూ.3,016 చొప్పున, అన్ని రకాల పింఛన్‌దారులకు రూ.2,016 చొప్పున ఖాతాల్లో జమవుతున్నాయి.

నాలుగు నెలలుగా ఎదురుచూపులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తగా 18 వేల మందికి ఆగస్టులో పింఛన్‌లు మంజూరయ్యాయి. వారందరికీ గుర్తింపుకార్డులు అందించారు. వారిలో 900 మందికి పింఛన్ డబ్బులు అందడం లేదు. నాలుగు నెలలుగా వారికి ఎదురుచూపులే దిక్కయ్యాయి. లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

వివరాలు సరిగ్గా లేక ఆగాయి



“ జిల్లాలో కొత్తగా 18 వేల మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వారి ఖాతాల్లోనే జమవుతున్నాయి. పింఛన్ డబ్బులు రావడం లేదని కొందరు ఆఫీస్‌లకు వస్తున్నారు. చాలా మంది ఖాతాల వివరాలు సరిగ్గా లేకనే పింఛన్ డబ్బులు జమకావడం లేదు. 900 మందికి సమస్యలు ఏర్పడితే.. సుమారు 700 మందివి పరిష్కరించాం. ఎవరికైన కార్డులు వచ్చినా.. పింఛన్ జమకాకపోతే మమ్ములను సంప్రదిస్తే సమస్య పరిష్కరిస్తాం. – పాపారావు, ఏపీవో, పెన్షన్స్, రాజన్నసిరిసిల్ల

పని నచ్చకే సోషల్ మీడియాలో పోస్టు

- మంత్రి కేటీఆర్‌కు గల్ఫ్ బాధితుడి వేడుకోలు ఓ డ్రామా
- ప్రకటించిన కంపెనీ యాజమాన్యం
- వీసా, డబ్బులిచ్చి యువకుడిని ఇంటికి పంపించిన వైనం


ఇమ్రాన్‌కు వీసా, టికెట్ అందిస్తున్న యాజమాన్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దుబాయిలో కంపెనీ ఇబ్బందులు పెడుతోందని రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఇమ్రాన్ సోషల్ మీడియాలో చేసిన ఆరోపణలు అవాస్తమని సదరు యాజమాన్యం గురువారం ప్రకటించింది. పని నచ్చకపోవడంతో ఇంటికి వెళ్లేందుకు డ్రామా ఆడాడని తెలిపింది. వివరాలిలా ఉన్నాయి.. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎన్నారై రాధారపు సత్యం దుబాయిలో ఎల్ఎస్‌పీఎంకే కంపెనీ నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఇమ్రాన్ ఉచిత వీసాపై ఆ కంపెనీలో పనిలో చేరాడు. కొంతకాలం చేసిన తర్వాత ఆ పని నచ్చలేదు. దీంతో తనను కంపెనీ ఇబ్బందులు పెడుతోందని, స్వగ్రామానికి రప్పించి, న్యాయం చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను సోషల్ మీడియా ద్వారా వేడుకున్నాడు. స్పందించిన ఆయన రాయబార సంస్థతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. యువకుడి పోస్టు వైరల్ కావడంతో స్పందించిన కంపెనీ యాజమాన్యం సదరు యువకుడితో మాట్లాడింది. తనకు ఇంటికి వెళ్లాలని ఉందని, అందుకే తప్పుగా పోస్టు పెట్టానని అతను ఒప్పుకున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా మానవతా దృక్పథంతో గతంలో అతనికి ఇచ్చిన వర్క్ వీసాను రద్దు చేసి, మరో వీసా, టికెట్‌తోపాటు 300 దరమ్స్ ఇచ్చి, ఇంటికి పంపించింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ ఆ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపాడు.

బావిలో పడి చేనేత కార్మికుడి మృతి

కోనరావుపేట(వేములవాడ): పల్లిమక్త శివారులోని వ్యవసాయబావిలో పడి చేనేతకార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని పల్లిమక్తకు చెందిన నాయిని ప్రభాకర్‌రెడ్డి పొలంలో పనులు చేసుకుంటూ బావిలో మోటార్ పెడుతుండగా గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. వెంటనే కోనరావుపేట పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్సై రమాకాంత్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి చేరుకుని గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని వద్ద లభించిన ఆధారాలను బట్టి వరంగల్ జిల్లా పరకాల మండలం సాయంపేటకు చెందిన గడ్డం వెంకటాచలంగా గుర్తించారు. ఇతను సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. సిరిసిల్లలో పనిచేస్తున్న వెంకటాచలం 15 కిలోమీటర్ల దూరానా ఉన్న పల్లిమక్త శివారు బావిలో శవమై తేలడం అంతుచిక్కడం లేదు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

సాక్షులను బెదిరించిన పెద్ద మనుషుల అరెస్టు

చందుర్తి(వేములవాడ): హత్య కేసులో సాక్షులను బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసిన చందుర్తి మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన ముగ్గురు పెద్ద మనుషులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నర్సింగాపూర్‌కు చెందిన మెరుపుల హరీశ్ హత్య కేసులో సాక్ష్యులైన బండి శ్రావణ్, కొమ్ముసపల్లి రాజశేఖర్‌లను నిందితులు నేరెళ్ల రమేశ్, వేణు, మల్లేశంలు బెదిరింపులకు గురిచేశారు. అంతేకాకుండా రమేశ్ ఇల్లు దహనం చేసిన కేసులో నిందితులుగా ఉన్న బండి శ్రావణ్, కొమ్ముసపల్లి రాజశేఖర్, కొమ్ముసపల్లి మహేశ్, కొలకాని నాగరాజుల నుంచి కేసును ఉపసంహరించుకునేలా చేస్తామని పెద్ద మనుషులు నేరెళ్ల మల్లేశం, చింతం దేవయ్య, సంపునూరి పర్శరాములుగౌడ్‌లు తెలిపారు. రూ.13 లక్షలను నేరెళ్ల మల్లేశం, నేవూరి రవి పేరిట బ్యాంకులో జాయింట్ ఖాతా తీసి, వేయించారు. మరుసటిరోజే కేసును ఉపసంహరించుకోబోమని అదనంగా రూ.17 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డారని బండి శ్రావణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేశారు. నేరెళ్ల రమేశ్, వేణు, మల్లేశంలను వారం క్రితమే అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపగా, పెద్ద మనుషులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో రచయిత మృతి


కిషన్‌రావు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 15 ఏళ్లపాటు విద్యాబోధన చేసిన రిటైర్డ్ హెచ్ఎం, కవి, రచయిత రేగులపాటి కిషన్‌రావు(83) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబంతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నారు. ఎల్లారెడ్డిపేటలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే రచనలు చేశారు. ఆయన కలం నుంచి వెలువడిన ‘ఆమె వితంతువు కాదు..కిరణాలు’ అనే కవితా సంకలనం ఎందరినో ప్రభావితం చేసింది. ఆయన మరణంపై ఎల్లారెడ్డిపేటలో అప్పటి విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కందుకూరి రమణ, బహుబాషా కోవిదులు డాక్టర్ నలిమెల భాస్కర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గొర్రెల కాపరిపై దాడి


రక్తమోడుతున్న మహేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన గొర్రెల కాపరి ఒగ్గు మహేశ్‌పై ముగ్గురు గురువారం దాడిచేశారు. ఈ సంఘటనలో మహేశ్ తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మహేశ్ తన గొర్రెలను మేత కోసం రాచర్లబొప్పాపూర్ శివారులోకి తీసుకెళ్లాడు. అదే గ్రామానికి చెందిన బుర్రవేణి రమేశ్, బుర్రవేణి నారాయణ, లంబ ఎల్లయ్య తమ శివారులోకి గొర్రెలు ఎందుకు తీసుకొచ్చావంటూ కర్రలతో దాడి చేశారని బాధితుడు తెలిపాడు. అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా దాడిచేయడంతో మహేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలి


వరి చేనులో ఎంఏవో ప్రణీత

బోయినపల్లి(వేములవాడ): రైతులు నారు మడుల్లో పురుగులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఏఓ ప్రణీత కోరారు. మండలంలోని గుండన్నపల్లి, బోయినపల్లి గ్రామాల్లో గురువారం వరి చేలను పరిశీలించారు. ప్రణీత మాట్లాడుతూ పలు గ్రామాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారని కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన


పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేట, బొల్లారం గ్రామాల్లో కరీంనగర్ ఏరువాక శాస్త్రవేత్తలు గ్రామాలలో పర్యటించారు. పంట పొలాల్లో ఎలుకలతో జరుగుతున్న నష్టాలు, వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల నివారణకు బ్రోమడయోలిన్ లేదా జింక్‌ఫాస్ఫైడ్‌ను ఎరువులో కలిపి బొరియల దగ్గర ఉంచాలని సూచించారు. కేంద్రం కోఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త ఎస్.రాజేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి సందీప్, సర్పంచులు సుద్దాల లచ్చయ్య పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన కార్పెంటర్స్ కార్యవర్గం


చైర్‌పర్సన్ కలిసిన నూతన కమిటీ

సిరిసిల్లఅర్బన్: నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల పట్టణ విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళను మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. అధ్యక్షుడు రేవోజు ప్రవీణ్, మాజీ అధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి తిప్పవరం మల్లేశం, కోశాధికారి శ్రీధర్, భాస్కర్, సుదర్శన్, రంజిత్, కరుణాకర్, రవిందర్‌చారి ఉన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


దుమాలలో చెక్కులు అందజేస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ఆపద సమయంలో ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. దుమాలలో నిమ్మల సత్తమ్మ, రాచర్ల బొప్పాపూర్‌లో మానుక పర్శరాములు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను తోట ఆగయ్య పరామర్శించారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ఎంపీపీ భాస్కర్, సర్పంచులు కొండాపురం బాల్‌రెడ్డి, రజిత, ఎంపీటీసీ శంకర్, శ్రీనివాస్, నాయకులు నర్సింహారెడ్డి, మధు, శ్రీనివాస్, స్వామి, వెంకటేశ్, గోపాల్ పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులు వివాదాస్పదం

- రోడ్డుపై బైఠాయించిన అగ్రహారం గ్రామస్తులు
- తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు


ధర్నా చేస్తున్న అగ్రహారం గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్–అగ్రహారం గ్రామాల మధ్య మురికి కాలువల వివాదం చోటుచేసుకుంది. రెండు రోజులుగా వెంకటాపూర్‌లో మురికి కాలువలు నిర్మించాలని గ్రామస్తులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వెంకటాపూర్ శివారు వరకు తాత్కాలికంగా డ్రైయినేజీ నిర్మాణాన్ని జేసీబీ సహాయంతో గురువారం చేపట్టారు. గ్రామశివారు వరకు నిర్మిస్తే మురికినీరు తమ గ్రామంలోకి వస్తుందంటూ అగ్రహారం గ్రామస్తులు సాయంత్రం ఆందోళనకు దిగారు. డ్రైయినేజీ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రెండు గ్రామాల ప్రజలను శాంతింపజేశారు. తహసీల్దార్ జయంత్‌కుమార్ మాట్లాడుతూ.. రెండు గ్రామాల మధ్య చెలరేగిన వివాదం పరిష్కారమయ్యే వరకు పనులు చేయొద్దని ఆదేశించారు. ఏఎస్సై కిషన్‌రావు ఆందోళన చేస్తున్న వారిని శాంతింపజేసి అక్కడి నుంచి పంపించారు. సర్పంచ్ మునిగే అమృత, ఉపసర్పంచ్ బాలమల్లు, గ్రామస్తులు దేవయ్య, బాలు, రవి, ఎల్లం తదితరులు ఉన్నారు.

మనస్పర్థలతో వివాహిత ఆత్మహత్య

- సర్పంచ్‌తండాలో ఉద్రిక్తత

రుద్రంగి(వేములవాడ): దంపతుల మధ్య మనస్పర్థలతో మండలంలోని సర్పంచ్‌తండాకు చెందిన వివాహిత మంజుల(23) ఆత్మహత్య చేసుకుంది. సర్పంచ్ తండా గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. సర్పంచ్‌తండా సర్పంచ్ మాలోతు రమణయ్య కుమారుడు మాలోతు ప్రసాద్ ఉద్యోగరీత్యా భార్య మంజులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో ప్రసాద్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి.. తెల్లవారుజామున 3 గంటల సమయంలో తిరిగి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా మంజుల ఉరివేసుకుని కనిపించింది. విషయాన్ని తండ్రి రమణయ్యకు తెలపగా.. రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చాడు. చనిపోయిన చోటే ఫిర్యాదు చేయాలన్న ఎస్సై సూచనలతో హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి 14 నెలల కుమారుడు ఉన్నాడు.

సర్పంచ్‌తండాలో పోలీసుల బందోబస్తు

ఈ విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు అధిక సంఖ్యలో సర్పంచ్ తండాకు చేరుకున్నారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో చందుర్తి, రుద్రంగి, వేములవాడటౌన్, కోనరావుపేట ఎస్సైలు రమేశ్, ప్రభాకర్, రాంరెడ్డి, రమాకాంత్ బందోబస్తు చేపట్టారు. మంజుల మృతదేహాన్ని శుక్రవారం తీసుకొచ్చి, అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

వ్యసనాల నుంచి విముక్తి పొందాలి

- సైకాలజిస్ట్ పున్నంచందర్


మాట్లాడుతున్న పున్నంచందర్

సిరిసిల్ల: సంసారాల్లో వివాదాలకు వ్యసనాలు కారణమవుతున్నాయని, వ్యసనాల నుంచి విముక్తి పొందాలని ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ సూచించారు. సిరిసిల్లలోని వెంకంపేటలో గురువారం నేతకార్మికులకు సామూహిక కౌన్సెలింగ్ నిర్వహించారు. పున్నంచందర్ మాట్లాడుతూ మద్యపానం, మత్తుపదార్థాలు వ్యక్తి మెదడు, నాడీ వ్యవస్థను బలహీన పరుస్తుందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వ్యక్తి పారానాయిడిజం అనే మానసిక ఒత్తిడికి లోనవుతాడన్నారు. అనుమానాలు, కుటుంబ కలహాలకు ఇది కారణమవుతుందని వివరించారు. మెదడుపై ప్రభావం చూపే మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అపోహలు, భ్రమలు తొలగిపోయేందుకు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలోని మనో వికాస కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. మరమగ్గాల ఆసాములు పోలు రాజయ్య, మాదాసు రవీందర్, తోటపెల్లి వీరయ్య, లక్ష్మణ్, మనోవికాస కేంద్రం సిబ్బంది రాపెల్లి లత, కొండ ఉమ, బూర శ్రీమతి, వేముల అన్నపూర్ణ పాల్గొన్నారు.

రూ.వంద కోట్ల అవినీతిని బయటపెడతాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వేములవాడలో జరిగిన రూ.వంద కోట్ల అవినీతిని ఆధారాలతో సహా బయటపెడతానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. వేములవాడలో గురువారం నిర్వహించిన వేములవాడ, వేములవాడఅర్బన్, వేములవాడరూరల్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రూ.వంద కోట్ల అవినీతి జరిగిందని, బయటపెడతానని నెల క్రితం ప్రకటించిన వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు జర్మనీ వెళ్లిపోయారన్నారు. ఎవరు అవినీతికి పాల్పడ్డారో ఆధారాలతో తాను శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు అధికారులకు ఫిర్యాదు చేస్తానని ప్రకటించారు. నిరుపేదల కోసం తండ్రి 130 ఎకరాల భూమిని అప్పగిస్తే తనయుడు గుంజుకుంటున్నాడని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆ భూమిని పేదలకు పంచుతామన్నారు. ఈనెల 26లోపు అన్ని మండలాల కమిటీలను సమన్వయంతో కలిసి ఎన్నుకోవాలని సూచించారు. అర్బన్, రూరల్ మండలాల అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, వెంకటస్వామి, సీనియర్ నాయకులు కూస రవీందర్, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, శ్రీహరి, తూం మధు, రంగు వెంకటేశ్, సామ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ చెన్నాడి శ్యామల, సంగ స్వామి పాల్గొన్నారు.

జోరుగా నాట్లు





యాసంగి సీజన్‌లో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వరి సాగు కోసం ఇప్పటికే రైతులు వరినారును సిద్ధం చేసుకోగా.. కొన్ని ప్రాంతాల్లో నాట్లు జోరందుకున్నాయి. కూలీలు దొరక్కపోవడంతో రైతు కుటుంబాల్లోని సభ్యులు అందరూ పనులకు వస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల